


# చదువూ—సంధ్యా

కొండముది హనుమంతరావు

కథానిక

ఏకాంతంగా బీచ్‌లో కూర్చున్నాను. సుదూరంలో గల చెట్లకూ కొండలకూ వెనుకగా సూర్యుడస్తమిస్తున్నాడు—నున్నని కొండల నీలిమ వర్ణం మరీ చిక్కబడ్డది...చరమారుణుని కాంతిలో వింత వింత రంగులతో మెరిసిన చెట్లు నల్లనిరూపం తాల్చాయి ... తెలుపూ—నలుపులతో వింతగా ప్రకాశిస్తూన్న విశాల సాగరం, ఆద్యంతాలు లేని నిర్మల నీలాకాశం కలిసేచోటు ఎరుపురంగునాహ్వానించింది.

ప్రకృతి యింత సుందరంగానూ, మనోహరంగానూ ఉంటే ఆ అందాన్ని చూసి ఆనందించగల రసజ్ఞత లేక కాకపోతే సూర్యుడో గ్రహమని, ఆకాశం శూన్య ప్రదేశమని చెప్పటమేమిటి సైంటిస్టులు?

"పగటికల ఎంతవరకూ వచ్చింది?"—ఎప్పుడు వచ్చిందోగాని నా పక్కన కూర్చొనిఉంది సంధ్య.

"కలకాదు. ఈ ప్రపంచంలోగల కుట్ర, ద్వేషం, మోసాలకు దూరంగా ఉందామని ఇలా వచ్చి, ఏ చిత్రకారుని కుంచెకూ అందని సంధ్యాదేవి సౌందర్యాన్ని చూస్తూ ఆనందిస్తూన్న సమయంలో ఈ సంధ్యాదేవిగారు వచ్చినట్లున్నారు, చూడలేదు" అన్నాను గుక్క తిప్పుకోకుండా.

"ఓహో! షెల్లీ కవిత్వం జీర్ణించుకున్నావా!"

"అంత తీరికలేదులే. షెల్లీ ఏమంటాడేమిటి?"

"ఏకాంతంగా ఉన్నపుడుగాని, కనీస సానుభూతి అయినా చూపించని మనుష్యుల మధ్య ఉన్నపుడు గాని, పూలనూ, ఆకాశాన్నీ సముద్రాన్నీ ప్రేమిస్తారుట కొందరు."

"అదినిజమే; స్వానుభవంవల్ల చెప్పుంటాడు."

"ఏ రచయితా ఏదీ అనుభవంలేనిదే చెప్పడులే—సంధ్యాకాలపు సౌందర్యాన్ని లాబరేటరీలోని ఒక్క టెస్టుట్యూబ్‌లో చూపించగల నంటుంది మా మధుబాల, తెలుసా?"

"ఓహో! ఇలాంటివాళ్ళు ఉండటంవలనే——"

"ఏం ఆపేశావ్"

"ఏం లేదులే"

"పోనీ! ఏంలేక పోతే నేనొకటి అడుగుతాను దాచుకోకుండా చెప్తావా?"

"ఊఁ"

"చదువుకున్న స్త్రీలమీద నీ అభిప్రాయం ఏమిటి?"

"చదువుకున్న స్త్రీలు అంటే—"

"అంటే బి. యే. గాని, ఆనర్సుగాని చదివి, డిగ్రీపొంది, సంఘాన్ని ఎదిరించినా ప్రకృతి ప్రభావానికి ఎదురుతిరగలేక, లొంగిపోయి ఐ. ఏ. ఎస్. ఆఫీసరుకోసం కలలుగని చివరకు ఓ యన్. జి. వో.ని పెళ్ళిచేసికొనే స్త్రీలు."

"ఇందులో నేచెప్పేదేముంది? అలాంటి స్త్రీలను స్థూలంగా రెండు రకాలుగా విభజించవచ్చు. తమ సాంసారిక జీవిత రథాన్ని-తమ చదువూ సంస్కారాలను ఉపయోగించుకొని-జీవిత పథంలోగల ముళ్ళపొదలను జాగ్రత్తగా పక్కకి తొలగించి గమ్యస్థానానికి చేర్చగలిగేవారు మొదటిరకం. ఇక రెండవరకం ఎవరూఅంటే తమ విద్యార్థి జీవితాన్ని ఆ రోజులలో పొందిన మధురానుభూతులనూ జ్ఞప్తికి తెచ్చుకుంటూ, ఆ రోజులు తిరిగిరావని నిట్టూరుస్తూ తమ

జీవిత సాగరంలో తుఫాను రేగకొట్టుకొని తమ సాంసారిక జీవితనావను దరికి చేర్చలేనివారు."

"ఇంతవరకూ నీవు చెప్పింది 'దాచేస్తే దాగని సత్యం.' ఆపైన నీకూ, మీకూ, అర్థంకాదు. స్త్రీకే అర్థమవుతుంది. ఆ రెండవరకంలో కొందరుమాత్రం ఏదో ఒకనాటికయినా తమకు సంఘంలో ఎలాంటి స్థానం ఉందో... తాము సుఖంగా జీవించటానికి ఎలాంటి సదవకాశాలున్నాయో గ్రహించి జీవితాన్ని నందనవనంగా చేసికొంటారు."

"ఒప్పుకుంటాను."

"ఆ విషయాన్నాధారం చేసికొనే నేనొక కథ-చాలాచిన్నది-రాశాను. చదువుతాను వింటావా?" అన్నది సంధ్య.

చచ్చానురా భగవంతుడా! అనుకున్నాను. వినలేను అంటే బాధపడుతుంది. అందమైన అమ్మాయిల మనస్సు నొప్పికలిగించకూడదని నా అభిప్రాయమూ-సిద్ధాంతమూనూ. అదీకాకండా రేపు నాకథ సంధ్య వినవద్దూ!

"సరే త్వరగా చదువు. చీకటిపడితే అక్షరాలు కనబడవు" అన్నాను.

"మధ్యలో ఆపకు. విమర్శలుంటే సహృదయతతో చివరికి స్వీకరిస్తాను" అంది-తను ఓ పెద్ద రచయిత్రి అయినట్లుగా.

* * *

శ్యామ తన ఆనర్స్ డిగ్రీనిచూసి ఏ ఐ. ఏ. యస్సో పెళ్ళిచేసుకుంటాడనుకుంటుంది. కాని చివరికి కలెక్టరాఫీసు గుమాస్తా ప్రకాశం బి. యే. తో పెళ్ళిజరుగుతుంది. ఆశాసౌధాలు కూలిపోతాయి. నిరంతరం నిరాశానిస్పృహలామె నయనాలలో ద్యోతక మవుతాయి. ఎప్పుడూ ఆలోచిస్తూ ఉంటుంది—తను కాలేజీలో చదివే రోజుల్లోలాగా సాయంత్రాలు బీచ్‌లో షైర్లు కొట్టాలనో ... మెయిన్ రోడ్డుమీద ఖటావ్ వాయిల్సు ఎడ్వర్టయిజుమెంటులాగా ముస్తాబయి చేతిలో హాండ్‌బాగ్ పట్టుకొని స్నేహితురాండ్రతో వినోదంగా విలాసంగా విహారంచేయాలనో. ప్రకాశం శ్యామలో మార్పుతీసుకొని రావాలనుకుంటాడొనాడు. రాత్రి పదిగంటలదాకా రూములో టేబుల్‌లైట్ వెలుగుతూనే ఉంటుంది.

మరుసటిరోజు ప్రకాశం ఆఫీసుకు పోయిన తర్వాత శ్యామ ఏదయినా నవలతీసి చదువుదామని గదిలోకి పోతుంది. టేబుల్‌మీద మొపాసా-కథల సంపుటి ఉంటుంది.

మొదటికథ "ది నెక్‌లేస్." ఆ కథ యిదివరకు చదివినదే. కొందరు తమకునచ్చిన కథలను స్నేహితులచేతకూడా చదివించి బాగుందనిపిస్తారు. శశి అలాంటిదే కావటంవల్ల ఒకనాడు ఆ కథతీసి చదవమన్నది. కథమీదగల యింటరెస్టువలనో లేక శశిమాట తీసివేయలేకనో ఓపికతో చివరిదాకా చదువుతుంది శ్యామ. ఆమె హృదయంలో ఒక విశిష్టస్థానాన్నాక్రమించుకుంటుందా కథానాయిక. ఆమెకది కథలాగా కనపడదు. ఎక్కడో ఎప్పుడో నిజంగా జరిగిన సంఘటననిపిస్తుంది.

కథానాయిక పెద్దగర్వి. ఆమె ఒకనాడు తన స్నేహితురాలిదగ్గర ఓనెక్లేస్‌ఎరువు తీసికొని పార్టీకి పోయి పారేసుకుంటుంది. కొంతధనం అప్పుతెచ్చి కొత్తదికొని స్నేహితురాలి కిచ్చేస్తుంది. ఆమె గర్వాన్ని చంపుకొని పనిమనిషిని, చాకలినికూడా మాన్పించి స్వయంగా పనులన్నీ తనేచేసుకుంటూ అప్పుతీర్చేసరికి పదిసంవత్సరాలు గడిచిపోతాయి. ఆ తర్వాత స్నేహితురాలు కనబడితే కథానాయిక చెపుతుంది నెక్‌లేసు పారేసినట్లు, కొత్తది కొనిచ్చినట్లు. స్నేహితురాలు "అరే! నీవు కొత్తది కొని యిచ్చావా! ఆ పారేసిన నెక్‌లేస్ ఇమిటేషన్‌ది" అంటుంది—అలా ముగిస్తాడు రచయిత కథను.

పార్టీకిపోయిన రోజు కథానాయిక జీవితంలో ఎంతమార్పు తెచ్చింది! ప్రతిమానవుని విషయంలోకూడా అంతేనేమో? అలా ఆలోచిస్తూ వుంటుంది శ్యామ. కిటికీలోంచి సముద్రం మీదినుండి రివ్వున గాలివస్తుంది. టేబుల్‌మీద నున్న పుస్తకపుపుటలు గాలికి కొట్టుకుంటాయి... సీలికవరు క్రిందపడుతుంది.

కవరుతీసి అడ్రసు చదువుతుంది శ్యామ.

"టు శ్రీమతి మంజులకు" పూర్తిగాకూడా లేదు అడ్రసు.

కవరంటించి ఉంటుంది. చించి లోపలేముందో చూడమంటుంది మనస్సు. అంతరాత్మ 'నీ చదువూ సంస్కారం యిదేనా? నీ భర్త ఎవరికో రాసి, పోస్టు చేయక ఏ కారణం వలనో అలావదలిన కవరును

ఆయన యింట్లోలేనప్పుడు-చింపి చదువుతావా? తప్పుకాదూ?" అని హెచ్చరిస్తుంది.

"తప్పేమీకాదు. భర్త పరస్త్రీ కుత్తరం రాస్తే బహుశా అది ప్రేమలేఖయి ఉండవచ్చు,చూస్తూ ఊరుకుంటావా...చూస్తూ ఊరుకుంటావా... చించి చదువు" అని ఎదిరిస్తుంది మనస్సు.

చివరికి మనస్సే నెగ్గుతుంది సంఘర్షణలో.

జాగ్రత్తగా చించుతుంది కవరును. ఏదో చేయరాని నేరం చేస్తున్నట్లు ఫీల్ అవుతుంది. చుట్టూ చూస్తుంది భయంతో ప్రకాశం వస్తాడేమోనని—అత డయిదింటికిగాని రాడని తెలిసికూడా.

చదువుతుంది.

"నీ ఉత్తరం చేరింది. నీ బాధ నా కర్థమయింది. అగ్నిసాక్షిగా పెండ్లాడిన భర్తమీద అర్థరహితమైన, నిరాధారమైన అనుమానాలు పెట్టుకోని, నీవు వూహించినట్లుగా జీవితం గడవటంలేదని వగస్తూ కూర్చుంటే లాభం ఏమిటి? పరిస్థితులను, పరిసరాలను పరిశీలించి పరికించి జీవితాన్ని మధుర స్వప్నంలాగా చూడటం నేర్చుకో! నీ చెల్లెండ్రకు, స్నేహితురాండ్రకూ ఆదర్శంగా ఉండు! అమర కవి రవీంద్రుడు-నీలాంటి వారికోసమే నేమో—ఏమి అన్నాడో తెలుసా! "యిఫ్ యు షెడ్ టియర్స్ వెను యు మిస్ ది సన్ యు మిస్ ఆల్సో ది స్టార్స్" - కాబట్టి యికనుంచి అయినా నీ భర్తను సహృదయతతో అర్థంచేసుకుంటావని నా ప్రగాఢ విశ్వాసం——నీ ప్రకాశం."

చీకటిలోనున్న ఆమెను ప్రకాశం ఒక చేతిలో విజ్ఞానజ్యోతిని పట్టుకొని, రెండవ చేతిలోకి ఆమె చేతిని తీసికొని వెలుగులోకి నడిపించుకుపోతున్నట్లుగా ఫీలవతుంది శ్యామ. ఆమె చదువు ఎందుకూ పనికిరాకుండాపోయిం దిన్నాళ్ళదాకా - గుడ్డివాని స్వహస్త దీపంలాగా.

పశ్చాత్తాపం చెందుతుంది శ్యామ. కవరు జాగ్రత్తగా అంటించి పుస్తకంలో ఉంచుతుంది.

ఆనాటినుండి వారి జీవిత నందవనంలో శ్యామ మధురలతానికుంజం-ప్రకాశం వసంతమూర్తి.

* * *

"ఎలా ఉంది కథ?" అన్నది సంధ్య ఆదుర్దాగా, ఏం చెపుతానోనని.

"శ్యామలో ఆ కాస్త ఉత్తరం అంత పెద్ద మార్పు తీసుకువస్తుం దేమిటి?"

"మొదటే చెప్పానుకదూ! నీకూ, మీకూ, అర్థంకాదనీ. శ్యామ 'సెంటిమెంటు' అంతే."

"సరే! ఆ 'శ్యామ' పాత్రలో మీ యింటి పక్కనుండే ఫిజిక్సునర్సమ్మాయి ఛాయలు ఉన్నాయి కదూ?"

"అవును!-చాలా బాగా కనిపెట్టావు. తెలివైన బుర్ర ఎక్కడికి పోతుందిలే, అందులో తప్పేముంది! "ఐ హావ్ నెవ్వర్ క్లైమ్డ్ టు క్రియేట్ యనీథింగ్ ఔట్ ఆఫ్ నథింగ్" అన్నాడు మాఘుం-నేనూ అంతే!"

"అయితే మాగజీనుకు పంపిస్తావా?"

"అనే!"

"విష్ యు గుడ్ లక్! ఆఁ! ఇంతకీ యింటి కెప్పుడు పోతున్నావో చెప్పలేదు?"

"రేపే! నీవో?"

రేపే! గుండె 'కలుక్కు' మన్నది. మూడేళ్ళ స్నేహం-తిరిగి ఎప్పుడు, ఎక్కడ కలుసుకుంటామో ఊహించలేకపోయాను.

"నే నింకా రెండురోజు లుండాలి. పని ఉంది" అన్నాను.

"ఉత్తరాలు రాస్తూ ఉండు శర్మా, వీలైతే వచ్చే సంవత్సరం రిసెర్చికి వస్తాను. అప్పుడే నను కుంటాను మళ్ళీ మనం కలుసుకో కలిగేది" అంది భొంగురు గొంతుతో-నే నూహించలేనిది సంధ్య ఊహించకలిగింది ... సంధ్య ఊహ ఎంతవరకు నిజమో కాలమే నిర్ణయిస్తుందనుకున్నాను.

"అంతేనేమో" అన్నాను-అంతకంటె ఏమీ చెప్పలేక.

బహుళ పాడ్యమి కాబోలు చంద్రు డెర్రగా ఉన్నాడు. చీకటిగా ఉంది.

సంధ్య నింటిదాకాపంపి నేను రూముకుపోయాను.

* * *

తరువాత రెండేళ్ళకు సంభవించింది సంధ్యను చూడటం. ఈ రెండేళ్ళలో-సంధ్యకూ, నాకూ డిగ్రీలురావటం సంధ్య పెళ్ళి జరగటం, చదువు మానేయటం, నేను ఉద్యోగంలో చేరటం, రాజీనామాకూడా యీయటం జరిగాయి.

ఢిల్లీకి పోవటానికింకా రెండు రోజులు టయిమున్నది. అక్కయ్యకూడా గుంటూరులోనే ఉంటున్నది బావకు ట్రాన్స్‌ఫర్ కావటంవల్ల.

"అక్కయ్యను చూసివస్తాన"ని చెప్పి యింటి నుండి బయల్దేరాను. అసలు అక్కయ్యకన్న సంధ్యను చూడాలనే ఉంది.

అక్కయ్య "ఎండలో ఎక్కడికి పోతావురా" అన్నా వినిపించుకోకుండా బయల్దేరాను భోజనం చేయగానే.

గుంటూరు నీటికరువు తీరిందిగాని ఎండలబాధ తప్పలేదు. అవును—పాపం మున్సిపాలిటీవారు మాత్రం ఏం చేయగలరు ఎండల్ని—నీటినంటే పంపులద్వారా తెప్పించారుగాని.

సంధ్యలో ఎంతో మార్పు వచ్చిఉంటుంది. పూర్వం సన్నగా, నాజూకుగా ఉండేది. ఇప్పుడు కొంచెం లావెక్కిఉండాలి. సామాన్యంగా ఆడవాళ్ళు ఎందుకోగాని, పెళ్ళిఅయిన తరువాత లావవుతారు. ఇదివరకు సంధ్య మెళ్లో ఒకే ఒక బంగారు గొలుసుఉండేది, ఇప్పుడో! మంగళ సూత్రం ఎంతో క్రొత్త అందాన్ని యిస్తుంది, అలా ఆలోచిస్తూ నడిచాను.

ఇల్లు ఎంతో అందంగా ఉన్నది. మేడముందు వివిధరకాల పూలమొక్కలు, వానిమధ్య రాధా కృష్ణుల విగ్రహాలు.

అబ్బ! ఎంత సౌందర్యోపాసన!

వరండాలో సోఫామీద కూర్చున్నాను. జవానుకుచెప్పి పంపించాను. మనస్సెంతో తొందర పడుతున్నది సంధ్యను చూడటానికి.

సంధ్య—అవును సంధ్యే! — వచ్చింది, నా ఊహంతా కల్లయింది. నిత్యమూ శ్యామల కాంతితో తళతళలాడే నయనాలు లోపలికి పీక్కుపోయి నిర్జీవంగా ఉన్నాయి. మనిషి చిక్కిపోయిందికూడాను.

ఎలక్ట్రిక్ షాక్ తగిలినట్లయింది. నోట్లోనుంచి మాటరాలేదు. అలాగే చూస్తూ ఉండిపోయాను.

"గుడ్ ఆఫ్టర్‌నూన్ శర్మా!" అన్నది సంధ్యే ముందుగా. నేనూ తిరిగి అన్నాను. వచ్చి సోఫాలో ఎదురుగాకూర్చుంది.

"ఇదేనా రావటం" అన్నది.

"లేదు, అక్కయగారింటికి పోయివస్తున్నాను"

"అవున్లే, మేము పరాయివాళ్ళంకదూ!"

"అదికాదు సంధ్యా! నీవుకూడా నన్నపార్థం చేసుకుంటే ఎలా చెప్పు! నీ పెళ్ళికి రాలేక పోయాను. వీలులేకపోయింది. నే చాలా విచారిస్తున్నాను."

"లేదు లేశర్మా! ఊరికినేఅన్నాను. నేను అపార్థం చేసుకోలేదు—చేసుకోలేనుకూడాను."

"అదే నేకోరుకుండేది! శేఖరంగారేరీ?"

"ఊళ్లో లేరు, ఏదో సీరియస్ కేసుందని యిందాకనే వెళ్లారు."

"మళ్ళీ ఎప్పుడువస్తారు?"

"ఇంకోగంటలో వస్తారులే, ఆయన్ని నీవు చూడలేదుకదూ?"

"లేదు. నేనొకటి అడుగుతాను చెప్తావా సంధ్యా?"

"ఏమిటి శర్మా! అంతకొత్తగా మాట్లాడుతున్నావు, ఏనాడయినా నీవడిగిందానికి జవాబు చెప్పలేదూ!"

"నీమీదనుమానమేమీలేదు సంధ్యా! ఆనాడు కథరాసి చదివావు చూశావూ! దాన్నేం చేశావు?"

"పత్రికకు పంపాను...ప్రచురించబడలేదు... అదీ మంచిదేలే!"

"అయితే, యింతకీ నీవిప్పుడేరకంలో చేరావు?"

"క్షమించు శర్మా! ఆసంగతే ఒకసారి నీకు రాద్దామని కూర్చున్నాను. కాని కలం సాగలేదు. నువ్వువస్తే చెపుదామని నీరాకకోసం ఎదురుచూశాను కొన్ని రోజులు. ఆకథ రాసేనాటికి నేనింకా చదువుకుంటున్న స్త్రీనే, కాని యిప్పుడు చదువు కున్న స్త్రీని. నేనేరకంలో చేరతానో నాకు తెలియదు. ఎందుకంటావా? నా పరిస్థితి నాకు తెలుసు. ఆయనంటావా చాలా మంచివారు—అంతకన్నా నాకు పెద్దమాటలేమీ రావటంలేదు. నన్నెంత ప్రేమిస్తున్నారో ఈ పూలమొక్కలు, ఆ రాధాకృష్ణులూచూసి యీపాటికి గ్రహించే ఉంటావు! ఇక నాప్రేమంటావా! నేనూ ఆయన్ని ప్రేమిస్తున్నానుకాని ఏదో అసంతృప్తి...ఆవేదన నీకాశ్చర్యంగా ఉందికదూ 'యిన్ని తెలిసీ యిలా చేస్తున్నదేమిటా' అని!"

"లేదు—చెప్పు"

"ఒకవిధంగాచూస్తే నీదీతప్పేమో" ఆపింది మాట్లాడటం.

"ఆపేవెందుకు? ఫర్వాలేదు చెప్పు" అన్నాను.

"నీది స్వార్థంలేని ప్రేమశర్మా! సంధ్యసుఖంగా ఉంటే చాలుననుకున్నావు కాని, సంధ్యకు సుఖం ఎలా వస్తుందో గ్రహించుకోలేక పోయావు...నీదీ కాదులే నాతప్పుకూడా ఉన్నది. నేనూ చెప్ప లేకపోయాను నామనస్సులో ఏముందో. దాన్ని మనోదౌర్బల్యమే అంటావో మరి గర్వమే అంటావో" ఆపేసింది.

తలవంచుకు వింటున్నవాడిని తలెత్తి చూశాను. వెచ్చని బాష్పాలు చెంపలమీదుగా పగడపుతీగ మీద తొణికి పడేముత్యాలకు మల్లే జారి క్రింద పడుతున్నాయి.

"తప్పు సంధ్యా! నీవలా బాధపడకూడదు... నువు చదివిందీ, రాసిందీ వృథాఅవుతుంది. నేనిది వరకోసారి నీకు చెప్పాను చూశావూ, స్పెక్ట్రో మీటరుతో ఏయాంగిల్ లోంచిచూస్తే సోలార్ స్పెక్ట్రమ్ కనపడుతుందో మీ కనవసరం; జీవి తాన్ని ఏకోణంలోంచి చూసి, ఎలా చదవాలో, ఎలా అర్థంచేసుకోవాలో తెలుసుకోవాలీ అని. ఆ విషయం చాలావరకు నిజం. ఇప్పుడు నీ జీవి తంలో మునిగిపోయిందేమీ లేదు. నీకింకా కనీసం పాతికేళ్ళయినా రాలేదు...నీ వనుభవించాల్సిన జీవితమంతా ముందేఉంది. జీవిత మాధుర్యాన్ని ఆస్వాదించటానికి ప్రయత్నించు ... హృదయ పూర్వకంగా చేసిన ప్రయత్నం ఎప్పుడూ నిష్ఫలం కాదు!"

గడియారం గంటలు కొట్టింది-ఒకటి..రెండు... అయిదు.

"సంధ్యా! ఏదీ శేఖరం యింకా రాలేదే! ఆయన్ని చూసి పోదామనుకున్నాను" అన్నాను.

ఏమిటీ అప్పుడే పోతావా?"

"అవును-క్షమించాలి సంధ్యా! రేపు ఢిల్లీ పోతున్నాను ఉద్యోగం కోసం. నిన్నూ, శేఖరాన్ని చూసిపోదామని వచ్చాను."

"అలా అయితే నేనేం చేయగలను! కనీసంరెండు రోజులన్నా ఉంటావనుకున్నాను. కాఫీ అయినా తాగుదాం రా" అని లోపలికి తీసికెళ్ళింది.

కాఫీతాగి అలా వచ్చి రాధాకృష్ణుల ముందు కూర్చున్నాం.

"మళ్ళీ ఎప్పుడు వస్తావు శర్మా!" అంది.

"ఏమో చెప్పలేను-కనీసం నాలుగయిదేళ్ళుం టాను. అక్కడి జీవితం కూడా ఎలా ఉంటుందో చూద్దామనే పోతున్నాను కదూ."

"నాదో చిన్న సలహా శర్మా! సలహాకాదు- కోరిక. నీవు కొంచెం స్వార్థం గురించి ఆలోచించు కోవాలి. లేకపోతే నీకు జీవితం దుర్భరమౌతుంది. నీకు సంఘం కనీసం సానుభూతయినా చూపదు. నీ మేధస్సును వికసించ నీయదు. అలా అజ్ఞాతం గానే ఉండి పోవాల్సి వస్తుంది. అలాగే అందరికీ మంచి చేస్తానంటే లాభంలేదు. నీ కెవరూ మంచి చేయకపోగా చెడుచేయటానికి కూడా ప్రయత్ని స్తారు. అందుకనే నీలాంటి కొందరిలో స్వార్థం ఉంటేనేగాని రాణించలేరు. ఆ స్వార్థం కూడా 'మోడరేట్'గా ఉండాలి. మితిమీరిందంటే మళ్ళీ అపాయకరమే? ఏం శర్మా! అలా ఉండటానికి ప్రయత్నిస్తానని మాటయియ్యి" అంది.

ఏం చేయాలో అర్థంకాలేదు. మాట ఇవ్వాలా కూడదా! సంధ్యఏంచెప్పినా నిజమేననిపిస్తుంది.ఆమె చెప్పేవన్నీ అందుకనే అడ్డుచెప్పకుండా వింటాను.

"ప్రయత్నిస్తాను" అన్నాను చివరికి. "మరి నువ్వుకూడా ప్రయత్నించాలి జీవిత మాధుర్యాన్ని రుచిచూడటానికి. రుచిచూసి నాకుచెప్పాలి ఎలా ఉంటుందో" అన్నాను.

"నీమాట నెప్పుడయినా ఎదిరించానా! అయితే శర్మా! నీవు పెళ్ళి ఎప్పుడు చేసుకుంటావ్?"

"నీయిష్టం వచ్చినపుడు, నీకు నచ్చినదాన్ని."

"నిజంగా!"

"అవును-సంధ్యా! నీవే చెపితివిగా! నన్ను నువ్వు తప్ప ఎవరూ సరిగా అర్థంచేసుకోలేదని! అలాం టపుడు. నీకు తెలియదూ నే నెలాంటిదాన్ని చేసు కోవాలో!"

"కృతజ్ఞురాల్ని శర్మా! నీలాంటివాళ్ళీలోకంలో చాలాతక్కువ మంది ఉంటారు."

"ఇక నేను వెళ్తా సంధ్యా! శేఖరంగారిని చూడటానికి వీలులేకపోయింది. క్షమించమను."

"మంచిది."

గేటుదాటి వెనక్కి తిరిగి చూశాను—కళ్ళు తుడుచుకుంటున్నది సంధ్య పమిట చెంగుతో. గుండెలు బరువెక్కినాయి. మెల్లగా నడుస్తూ యింటికి చేరాను.

"అదేమిటిరా! కళ్ళంత ఎర్రబడ్డయి! ఎవరురా ఆ స్నేహితుడు మధ్యాహ్నం పోయి యిప్పుడు వచ్చావు" అంది అక్కయ్య.

"నీకు తెలియదులేవే" అన్నాను అక్కయ్యను కూడా బాధపెట్టటం యిష్టంలేక-సంధ్యకూ నాకూ గల స్నేహం గురించి చెప్పి.

అయినా అక్కయ్య కంటితడి చూడటం తప్ప లేదునాకు—ఇంకా నాలుగయిదు సంవత్సరాలకి గాని మళ్ళీ కనపడను అని చెప్పటంతో.

* * *

రైలులో కూర్చున్నానేగాని మనస్సు సంధ్య విషయమే ఆలోచిస్తున్నది. సంధ్యకు 'హృదయ పరివర్తనం'లో నమ్మకం ఉన్నది. ఆ నమ్మకంతోనే ఫణిక్కానరసమ్మాయి నాధారంగా తీసికొని 'శ్యామ'ను సృష్టించి కథ అల్లింది...'శ్యామ'లో మార్పు తెచ్చింది.

ఆ కథ చదివితే నయినా ఆ ఫణిక్కానరసమ్మయిలో పరివర్తన వస్తుందనాశించింది...కాని కథే ప్రచురణకా లేదుట. ఇంకేం చేస్తుంది!

తన విషయం వచ్చేసరికి తనలో మార్పు రావాలి, తను సుఖపడాలి, శేఖరంను సుఖపెట్టాలి అందుకు తను చదివిన చదువూ, తన కలవడిన సంస్కారమూ ఉపయోగించుకోవాలి అని తెలిసినా తను మారలేక పోయింది యింతవరకూ.

పైగా నాకుమటుకు హితబోధ చేసింది యథాశక్తి. నేను 'స్వార్థం' పెంపొందించుకోవాలిట! ఇంకా నయం అంతతోనే ఆపింది! వెంకట్రావు ఒకసారి అసూయ, స్వార్థం రెండూ ఉంటేగాని నేను రాణించలేనని చెప్పాడు.

"చలపతి ఐ. ఎ. యస్.కి సెలక్టయినాడుట" అన్నాడు ఏడుపు మొఖంతో.

"అవును వాడిలో మెరిట్ ఉంది. సెలక్టయినాడు. అందుకు నీవేడవటం ఎందుకు" అన్నాను నేను.

"ఏడవక, సంతోషించమంటావా! మన కళ్ళ ముందు తిరిగేవాడు కలెక్టరయితే." అన్నాడు.

"నీకూ చేతయితే చదువూ" అన్నాను.

"నాలాంటివాడి కెటూ లాభంలేదు. నువ్వు ఉన్నావూ అంటే సంతోషిస్తావుగాని వాడు సెలక్టయినాడూ అంటే అసూయపడవు. ప్రయత్నించవు చదవటానికి, అందుకనే మానవునిలో-ముఖ్యంగా నీలాంటివారిలో అసూయ ఉంటేకాని లాభంలేదు" అన్నాడు.

విని ఊరుకున్నాను. వెంకట్రావూ, సంధ్యా చెప్పినవి నిజమేననిపించింది. ఆలోచించాలి.

మళ్ళీ సంధ్య దగ్గరకు వచ్చింది మనస్సు... తను 'ప్రయత్నిస్తాను' అంది కాబట్టి సంధ్యలో తప్పక మార్పువస్తుంది, రావాలి.

ఎందుకయినా మంచిది, అక్కయ్యకో ఉత్తరం రాయాలి సంధ్య అడ్రసుతో. అప్పుడప్పుడు పోయి చూసి, మాట్లాడి వస్తూవుంటుంది.

చివరికా నిశ్చయానికివచ్చి ఆ రాత్రికి నిద్ర పోవటానికి ప్రయత్నించాను మెల్లగా హోల్డాలు పరిచి.

---

ప్రజలమధ్య సంబంధాల విషయంలోగాని, ప్రజాస్వామ్య వ్యవస్థల నిర్వహణ విషయంలోగాని లోపరాహిత్యం అనేది ఎప్పటికీ వుండకపోవచ్చు. అయినప్పటికీ ప్రజాస్వామ్యంలో ఆదర్శానికీ, ఆచరణకు మధ్యనుండే తేడా ఎల్లప్పుడూ తగ్గించబడుతూ వుండాలి. ఎందువల్లనంటే, ప్రజాస్వామ్యం అభివృద్ధి చెందాలన్నా; కనీసం సజీవంగా వుండాలన్నా, అది ఎల్లప్పుడూ చైతన్యపూరితంగా వుండాలి. ప్రజాస్వామ్యం తన ప్రజలకు మరింత స్వాతంత్ర్యాన్ని, ఉత్తమ జీవితాన్ని, మరింత పరిపూర్ణమైన గౌరవాన్ని చేకూర్చడానికి పురోగమించాలి. వెనకడుగు ఎదైనా వేసినా, ప్రజాస్వామ్య పౌరుల హక్కులు వేటికైనా భంగం కలిగినా, వ్యక్తి గౌరవానికి ఎలాగైనా వెనకబట్టినా, అటువంటి చర్యలవల్ల ప్రజాస్వామ్యానికిగల జీవశక్తి దెబ్బతింటుంది; అభ్యుదయ పథాన మానవజాతి జరుపుతున్న పురోగమనం మందగిస్తుంది.—**డాక్టర్ రాల్ఫ్ బంచ్.**